సాక్షి అనకాపల్లి

గురువారం । 17 । జూలై । 2025



బలవంతపు భూసేకరణ ఆపాలి

కె.కోటపాడు మండలంలో ముందస్తు సమాచారం లేకుండా సర్వే చేపట్టడం సరికాదని రైతులు ఆందోళన చేశారు. 8లో



పక్కాగా నేరస్తుల వివరాలు

క్రిమినల్ కేసుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. యలమంచిలి స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. 8లో



వైభవంగా గరుడ సేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. వైభవంగా గరుడ సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

పెడుంపాలెంలో చెట్ల కిందే పాఠాలు



రావికమతం: చీమలపాడు పంచాయతీ పెడుంపాలెంలో చెట్ల కింద పాఠశాల కొనసాగుతోంది. గ్రామంలో 18 కుటుంబాలు ఉండగా.. 14 మంది బాలలు బడిలో చదువుతున్నారు. వారి కష్టాల గురించి తెలుసుకున్న మండల డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి పాఠశాలను సందర్శించారు. ఈ విషయమై సర్పంచ్‌ను, ఉపాధ్యాయులను ఆరా తీశారు. గతంలో ఈ పాఠశాలకు స్వచ్ఛంద సేవ సంస్థ రేకుల షెడ్ నిర్మించిందని, ఈమధ్య ఈ షెడ్‌లో కిటికీలు, కరెంట్ సమస్య ఉండడంతో విద్యార్థులకు చెట్ల కింద పాఠాలు చెబుతున్నారని సర్పంచ్ గంగరాజు చెప్పారు. పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానని డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి హామీ ఇచ్చారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం–కిరండూల్ రైల్లు భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 17, 18వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఈ ఫొటో సర్కిల్‌లో ఉన్నది అక్రమ మైనింగ్ డాన్‌గా పేరొందిన వెంగమాంబ క్రషర్స్ అధినేత శ్రీనివాస్ చౌదరి. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎంపీ అండతో అనుమతి లేని లీజులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు.



ఎన్నికల్లో నామినేషన్ వేస్తున్న వేళ సీఎం రమేష్‌తో శ్రీనివాస్ చౌదరి (ఫైల్)

ఈ ఫొటోలో ఉన్నది వెంగమాంబ క్రషర్స్. అనకాపల్లి మండలం సీతానగరం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 251లో అక్రమ మైనింగ్ ఫిర్యాదుతో మూతపడింది. లీజు గడువు కూడా ముగిసింది. అనుమతి లేనప్పటికీ ఇక్కడ ప్రతి రోజూ మైనింగ్ కార్యకలాపాలు నడుస్తున్నాయి.





జిల్లా మైనింగ్ శాఖ అధికారుల ప్రకారం ఈ మైనింగ్ నాన్–వర్కింగ్. రికార్డుల్లో పనిచేయడం లేదని ఉన్నప్పటికీ వాస్తవంలో మాత్రం లారీలకు లారీలు మెటీరియల్ తరలిపోతోంది.

వెంగమాంబ అక్రమాలకు మైనింగ్ గులాం!

- అనుమతి లేకున్నా ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- భారీ ట్రక్కులతో మెటీరియల్ తరలింపు
- రోడ్డు మెటల్‌తోపాటు భారీ బోల్డర్లూ రవాణా
- చేష్టలుడిగి చూస్తున్న మైనింగ్ అధికారులు
- ఎంపీ సీఎం రమేష్ అండదండలతో రెచ్చిపోతున్న లీజుదారు



వెంగమాంబ క్రషర్స్‌లో యథేచ్ఛగా సాగుతున్న కార్యకలాపాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి మండలం సీతానగరం గ్రామంలోని వెంగమాంబ క్వారీలో లీజులు రద్దయినప్పటికీ ప్రతి రోజూ తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా జరుగుతున్నాయి. ట్రక్కుల్లో మెటీరియల్ తరలిపోతోంది. రోడ్డు మెటల్‌తోపాటు భారీ బోల్డర్లను కూడా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అక్రమ మైనింగ్ ఫిర్యాదుతో రూ.33 కోట్ల జరిమానా విధించినప్పటికీ... పైసా చెల్లించకుండా అనుమతి లేకుండా కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఈ వ్యవహారం వైపు మైనింగ్‌శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. రవాణా, రెవెన్యూ అధికారులు కూడా అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు.

అక్రమ మైనింగ్ పేరుతో భారీ జరిమానా...!

వాస్తవానికి జీఎస్ఎన్ శ్రీనివాస్ అనే వ్యక్తి సీతానగరం గ్రామ పరిధిలో సర్వే నెంబరు 251లో రెండు లీజులు తీసుకున్నారు. మొదటి లీజులో 4 హెక్టార్లు, రెండో లీజులో 1 హెక్టార్ తీసుకున్నారు. ఈ రెండు లీజుల్లోనూ రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ ఉందని పేర్కొన్నారు. ఈ రెండింటిలో ఒకదాని లీజు గడువు 2023 మే నాటికి ముగియగా... మరో లీజు గడువు ఫిబ్రవరి 2022 నాటికి ముగిసింది. మైనింగ్‌శాఖ రికార్డుల ప్రకారం... ఈ క్వారీ ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ అధినేత వెంగమాంబ శ్రీనివాస్ చౌదరికి ఇక్కడే నెం.193, 303 సర్వే నెంబర్లలో మరో రెండు లీజులు (సుమారు 3 హెక్టార్లు) ఉన్నాయి. వీటికి కూడా అనుమతి లేదు. డిమాండ్ నోటీసులు ఇచ్చారని... కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని తెలుస్తోంది. అయినప్పటికీ 251 సర్వే నెంబరులో మాత్రం ఇష్టారాజ్యంగా మైనింగ్ నిర్వహిస్తున్నారు. వాస్తవానికి వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ (వెంగమాంబ) **భూమిలో ఖనిజ సంపదను అక్రమంగా దోచేసి మైనింగ్ చేయడంతో మైన్స్ శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2020లో తనిఖీలు నిర్వహించారు. వందలాది లారీల్లో ఖనిజం** తరలిపోతుందని స్థానికులు సైతం అప్పట్లో ఫిర్యాదు చేశారు. అయినా లెక్క చేయకుండా ధిక్కార ధోరణితోనే మైనింగ్ డాన్ శ్రీనివాస్ చౌదరి స్థానిక మైనింగ్ అధికారులతో చేతులు కలిపి మైనింగ్ కొనసాగించారు. వాస్తవానికి ఆయన అక్రమ మైనింగ్‌కు సహకరిస్తున్నారనే ఫిర్యాదులతో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు కూడా పడింది. వెంగమాంబ స్టోన్ క్రషర్స్‌లో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఏకంగా 5 లక్షల 68 వేల 923 క్యూబిక్ మీటర్ల ఖనిజం దోపిడీ జరిగిందని మైన్స్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా నిర్ధారించింది. ఇందుకు రూ.32.36 కోట్ల మేర జరిమానా విధించారు.

ఇక్కడ రిగ్ బ్లాస్టింగ్, తీసుకున్న అనుమతికి మించి అక్రమంగా తవ్వకాలు చేపట్టడం జరుగుతొందంటూ విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. ఏకంగా ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్ల మేర నష్టం వాటిల్లేలా కంపెనీ వ్యవహరించిందని కూడా పేర్కొన్నారు. అంతేకాకుండా తనకు రూ.3 కోట్ల మేర లంచం ఇచ్చేందుకు సదరు వెంగమాంబ యజమాని శ్రీనివాస్ ప్రయత్నించాడని కూడా అప్పట్లో విజిలెన్స్ మైనింగ్ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు.

కూటమిలో చేరికతో....!

ఎన్నికల ముందు సదరు మైనింగ్ లీజుదారుడు శ్రీనివాస్ కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలో చేరారు. అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన సీఎం రమేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇప్పుడు కూడా ఆయనతోపాటు కలిసి నడుస్తున్నారు. ఎలాగూ ఉన్నది కూటమి ప్రభుత్వమే కదా అనే దన్నుతో లీజు గడువు ముగిసినప్పటికీ... అనుమతి లేనప్పటికీ ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతున్నారు. రోడ్డు మెటల్‌తో పాటు బోల్డర్లను కూడా తరలిస్తున్నారు. పట్టపగలు ఈ వ్యవహారం నడుస్తున్నప్పటికీ మైనింగ్‌శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారంలో ఉన్నది తామేనని... తమను ఎవ్వరూ అడ్డుకోలేరంటూ ఇష్టారాజ్యంగా మైనింగ్ వ్యవహారం నడుస్తోంది. ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్ల నష్టం వాటిల్లిందని... రూ.33 కోట్ల జరిమానా విధించిన తర్వాత పైసా కూడా చెల్లించకపోయినప్పటికీ.. అక్రమ మైనింగ్ చేపడుతున్నప్పటికీ.. చేష్టలుడిగి చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిరాయింపు కార్పొరేటర్లకు షాక్!

- పార్టీ ఫిరాయించిన 27 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- విప్ ధిక్కరించి 'మేయర్'అవిశ్వాసంలో కూటమికి ఓటు
- వైఎస్సార్ సీపీ ఫిర్యాదుకు స్పందించని ఎన్నికల అధికారి
- **హైకోర్టును ఆశ్రయించడంతో ఎట్టకేలకు** నోటీసుల జారీ



ఫిరాయింపు కార్పొరేటర్లపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంతో తైనాల (ఫైల్)

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. స్వార్థ రాజకీయాలు, డబ్బులకు ఆశపడి 27 మంది కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించారు. పార్టీ విప్‌ను ధిక్కరించి మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేశారు. ఇప్పుడు ఆ 27 మంది కార్పొరేటర్ల రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ వ్యవహారంపై వైఎస్సార్ సీపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఎన్నికల అధికారి ఎట్టకేలకు ఆ 27 మందికి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేయడంతో ఫిరాయింపు కార్పొరేటర్లలో అందోళన మొదలైంది.

అసలేం జరిగింది?

2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో 98 వార్డులకు గాను 59 స్థానాలను గెలుచుకుని వైఎస్సార్ సీపీ స్పష్టమైన మెజారిటీ సాధించింది. బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన మేయర్ పదవిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారిని అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జీవీఎంసీని కైవసం చేసుకునేందుకు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పావులు కదిపింది. మెజారిటీ లేనప్పటికీ వైఎస్సార్ సీపీకి చెందిన 27 మంది కార్పొరేటర్లను డబ్బు, పదవుల ఆశ చూపి తమ వైపు తిప్పుకుంది. వీరిలో కొంత మంది టీడీపీ, మరికొందరు జనసేనలో చేరారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో.. ఈ 27 మంది కార్పొరేటర్లు వైఎస్సార్ సీపీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించారు. మేయర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు.

చట్టపరమైన పోరాటం

పార్టీ ఆదేశాలను ధిక్కరించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ విప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తైనాల విజయ్‌కుమార్ ఏప్రిల్ 22న జిల్లా ఎన్నికల అధికారి, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. 2008 మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని రూల్ నం.9 ప్రకారం, పార్టీ గుర్తుపై గెలిచిన సభ్యులు విప్‌ను ధిక్కరిస్తే వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఉంటుందని అందులో పేర్కొన్నారు. అయితే వారం రోజుల్లోగా వారికి ఇవ్వాల్సిన నోటీసులు జారీ కాలేదు. మరోవైపు మేయర్ ఎన్నిక సమయంలో కౌన్సిల్ సమావేశ మినిట్స్ కాపీని ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రెండుసార్లు కోరినా ఎన్నికల అధికారి స్పందించలేదు. దీనిపై తైనాల ఈ నెల 9న హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో 'కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేశా రా?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి సమాధానంగా రెండు రోజుల కిందటే నోటీసులు ఇచ్చా మని ఎన్నికల అధికారి తెలిపారు. కార్పొరేటర్లు ఇచ్చే సమాధానం ఆధారంగా పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామన్నారు.

నోటీసులు అందుకున్న కార్పొరేటర్లు వీరే..

ముత్తంశెట్టి ప్రియాంక (6వ వార్డు), లొడగల అప్పారావు (8వ వార్డు), కెల్ల సునీత (13వ వార్డు), గేదెల లావణ్య (17వ వార్డు), గుడ్ల విజయసాయి (23వ వార్డు), సారిపల్లి గోవింద రాజుల వెంకట అప్పారావు (25వ వార్డు), ఉరుకూటి నారాయణరావు (29వ వార్డు), కోడూరు అప్పలరత్నం (30వ వార్డు), మాసిపోగు మేరీజోన్స్ (36వ వార్డు), ఆళ్ల లీలావతి (42వ వార్డు), పెద్దిరెడ్డి ఉషశ్రీ (43వ వార్డు), కంపా హనోక్ (45వ వార్డు), కంటిపాము కామేశ్వరి (47వ వార్డు), చల్లా రజని (54వ వార్డు), ముర్రు వాణి (57వ వార్డు), పుర్రే పూర్ణశ్రీ (59వ వార్డు), కొణతాల సుధ (61వ వార్డు), బొడ్డు నరసింహపాత్రుడు (65వ వార్డు), రాజానా రామారావు (71వ వార్డు), తిప్పల వంశీరెడ్డి (74వ వార్డు), బట్టు సూర్యకుమారి (77వ వార్డు), కొణతాల నీలిమ (80వ వార్డు), పీలా లక్ష్మీ సౌజన్య(81వ వార్డు), ఇల్లపు వరలక్ష్మి (85వ వార్డు), కుంచె జ్యోత్స్న (91వ వార్డు), బెహరా వెంకట స్వర్ణలత శ్రీదేవి (92వ వార్డు), ముమ్మన దేముడు (95వ వార్డు).

గిరిజన బాలింతను వీడని కష్టాలు



వాహనం ఆగిపోవడంతో బిడ్డను ఎత్తుకొని నడుస్తున్న బాలింత

- తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఆగిపోవడంతో అష్టకష్టాలు
- నాలుగు రోజుల పసికందుతో కొండ ఎక్కిన మహిళ

రోలుగుంట: అర్ల పంచాయతీ శివారు లోసింగి గ్రామానికి చెందిన నిండు గర్భిణి కొండతాంబిలా సాయి(22)ని ఆమె భర్త డోలీలో కొండ దించుతుండగా ఈనెల 13న తుప్పల్లోనే ప్రసవించింది. సాక్షిలో ప్రచురితమైన ఈ వార్తకు స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో నర్సీపట్నం ఆస్పత్రిలో ఆమెకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. బాలింతను బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఆమెను లోసింగి తరలించేందుకు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటు చేశారు. అయితే రవాణాకు అనువుగా లేని ఈ రోడ్డులో కొండపైభాగం ఎక్కలేక వాహనం ఆగిపోయింది. దీంతో సాయి నాలుగురోజుల పసికందును ఎత్తుకొని తప్పని పరిస్థితిలో భర్త సుందర్రావుతో కొండ ఎక్కి అష్టకష్టాలు పడుతూ తన గ్రామానికి చేరుకుంది. తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రోడ్డెక్కిన రైతన్న

అన్నదాతల గుండె మండింది. ఆగ్రహం పెల్లుబికింది. పరిశ్రమల కోసమని భూములు తీసుకొని ఇచ్చిన మాట ప్రకారం తమకు ప్యాకేజీ ఇవ్వలేదన్న ఆవేదన రగిలింది. ఏడాదిగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో ఓపిక నశించి రైతులు, నిర్వాసితులు రోడ్డెక్కారు. మండుటెండలో 13 కిలోమీటర్లు పాదయాత్ర చేసి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

- మండుటెండలో 13 కిలోమీటర్ల పాదయాత్ర
- సేకరించిన భూములకు ప్యాకేజీ ఇవ్వకపోవడంపై ఆందోళన
- మాట నిలబెట్టుకోని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం
- పాదయాత్ర అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- సీఎం, హోం మంత్రిలకు వ్యతిరేకంగా నినాదాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నక్కపల్లి: భూసేకరణ గ్రామాల నుంచి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు 13 కిలోమీటర్ల పాదయాత్ర.. మండే గుండెలతో మండుటెండలో విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు, నివాస ప్రాంతాలు త్యాగం చేసిన వారి ఆందోళన.. కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతులు, నిర్వాసితుల ఆవేదనకు అద్దం పట్టాయి. వైఎస్సార్‌సీపీ, సీపీఎం వారికి సంఘీభావం తెలిపాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు తదితరులు బాధితులతోపాటు పాదయాత్ర చేశారు. తమ్మయ్యపేట, చందనాడ, ఎన్.నర్సాపురం, ఉపమాక మీదుగా నక్కపల్లి చేరుకుని తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేసి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారంటూ ఆరోపించారు. ప్యాకేజీ ఇచ్చేవరకు బల్క్‌డ్రగ్ పార్క్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బలవంతంగా పనులు చేపడితే అడ్డుకుంటామని ప్రకటించారు. తమ డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. రైతు నాయకులు పిక్కి తాతీలు, తళ్ల అప్పలస్వామి, చిన్నా, మనబాల రాజేష్, గోవిందరావు, వీసం నానాజీ, రాణి, అమ్మాజీ, మంగ, దారబాబు, వెంకటేష్ పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు



చందనాడ మీదుగా సాగుతున్న పాదయాత్ర

గత టీడీపీ ప్రభుత్వ కాలం నుంచి నలుగుతున్న సమస్య

విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2014లో టీడీపీ ప్రభుత్వం నక్కపల్లి మండలంలో 4,500 ఎకరాలు సేకరించింది. 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం, ఇళ్లు, నివాస ప్రాంతాలు కోల్పోయిన వారికి ఐదు సెంట్ల ఇంటి స్థలంతోపాటు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, ఇంట్లో మేజర్లయిన ఆడ, మగపిల్లలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని గ్రామసభల్లో మాట ఇవ్వడంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. ప్రభుత్వం కేవలం భూములకు నష్టపరిహారం మాత్రమే చెల్లించింది. దీంతో తమకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో వంగలపూడి అనిత సైతం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాజాగా కూటమి ప్రభుత్వం రైతుల నుంచి భూములు స్వాధీనం చేసుకోవడం ప్రారంభించింది. సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్క్ కోసం 2000 ఎకరాలు, మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు 2200 ఎకరాలు కేటాయించింది. దీంతో తమ్మయ్యపేట, పాటిమీద, మూలపర, కొత్తూరు, బోయపాడు గ్రామాలతో పాటు, డీఎల్ పురంలో వాడపేట, రాజయ్యపేటలో కొంతభాగం, చందనాడలో కర్రివారి వీధులలో నివాస ప్రాంతాలను ఖాళీ చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్వాసితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.8.90 లక్షలు ఇస్తామని ప్రకటించింది. దీన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇంటి నిర్మాణ వ్యయం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లు ఉపాధి కోల్పోయారని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.


వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తాం



నిర్వాసితులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఈ సమస్యను ప్రతిపక్ష నేత జగన్ దృష్టికి తీసుకెళ్తాం. బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు ఇవ్వకపోతే బల్క్‌డ్రగ్, స్టీల్‌ప్లాంట్ పనులు అడ్డుకుంటాం.

–వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

కూటమి ప్రభుత్వం మోసగించింది



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట తప్పింది. హోం మంత్రి అనిత కూడా మౌనం వహిస్తున్నారు. పోలీసుల సాయంతో పనులు చేస్తున్నారు. రైతుల తరఫున ఉద్యమం ఉధృతం చేస్తాం. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు. ప్యాకేజీ చెల్లించాల్సిందే.

–అప్పలరాజు, సీపీఎం నాయకుడు

పేణాలయినా ఇత్తాం



ఎన్నికల్లో అనిత ఓట్ల కోసం వచ్చి మీకు నాయం సేత్తానని సెప్పింది. ఇప్పుడు మొహం చాటేసింది. భూములు, ఇళ్లు తీసేసుకున్నారు. అప్పట్లో ఇత్తానన్న ప్యాకేజీ ఇప్పుడు ఇవ్వనంటున్నారు. ఇది ఎంత వరకు నాయం. పేణాలయినా ఇత్తాం కాని ఇళ్లు ఖాళీ సేయం.

–అమ్మాజీ, మహిళా రైతు, చందనాడ


చంద్రబాబు సర్కారు రెండు నాల్కల ధోరణి



ప్యాకేజీ కోసం పనులు అడ్డుకుంటే పోలీసుల సాయంతో బెదిరిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఒక విధంగా వ్యవహరిస్తోంది. ఏడాది ముందు రైతులకు అండగా ఉంటామని చెప్పిన టీడీపీ నాయకులు ఇప్పుడు ముఖం చాటేశారు.

–భార్గవ్, సర్పంచ్, రైతు నాయకుడు

మా బాధను గుర్తించండి



డీ ఫారం రైతులకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించలేదు. చెట్లకు నష్టపరిహారం ఇవ్వలేదు. ఇవేమీ పరిష్కరించకుండానే కంపెనీలకు భూములు ఇచ్చేసి పనులు చేసేస్తున్నారు. మహిళలు ఎండను సైతం లెక్క చేయకుండా 13 కి.మీ. పాదయాత్ర చేశారంటే ఎంత బాధ పడుతున్నారో గుర్తించాలి.

–గంటా తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు

క్లుప్తంగా

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



బాక్సింగ్‌లో స్టేట్ మెడల్ సాధించిన విద్యార్థి మోక్షిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, నాగేశ్వరరావు

నర్సీపట్నం : ఆంధ్రా బాక్సింగ్ అసోసియేషన్ వారు ఈ నెల 12,13వ తేదీల్లో విశాఖ రైల్వే స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాయ్స్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థి కుంచె మోక్షిత్ స్టేట్ బాక్సింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. బాక్సింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థి మోక్షిత్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీరెడ్డి శ్రీరామమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ అల్లు నాగేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

చేనేత సొసైటీని సందర్శించిన హోంమంత్రి



చేనేత కార్మికులతో అనిత

పాయకరావుపేట : పట్టణంలో గల చేనేత సహకార సంఘాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. జమదాని చీరల చేనేత కార్మికులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జమదాని చీరలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జమదాని చీరలు స్థానిక కళాకారుల ప్రతిభకు నిదర్శనమన్నారు. చేనేత కార్మికులకు అన్ని విధాలుగా చేయూత నందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేనేత రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని మంత్రి అనిత తెలిపారు.

డాక్టర్ నిఖితకు గోల్డ్‌మెడల్



రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ నిఖిత

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని నిఖిత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.రమేష్ నాయుడు, డాక్టర్ సునందరాణిల కుమార్తె డాక్టర్ కటారు నిఖిత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఏఐఐఎంఎస్ ఢిల్లీలో ఆబ్స్టెట్రిక్స్, గైనకాలజీలో పీజీ చేస్తున్న నిఖిత ఏఐఐఎంఎస్ భువనేశ్వర్ 5వ స్నాతకోత్సవంలో ఈ మెడల్ పొందింది. ఆ ఘనత సాధించడం పట్ల నిఖిత తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

లక్ష్యాలకు మించి రుణాలివ్వండి

- కౌలు రైతులకు, పరిశ్రమలు, డ్వాక్రాలకు ప్రాధాన్యం
- బ్యాంకర్లతో సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల: కౌలు రైతులకు, పరిశ్రమలకు, వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ ఉపాధి రంగాలకు, స్వయం సహాయక బృందాలకు త్వరితగతిన లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డీసీసీ), బ్యాంకు రుణాలపై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డి.ఎల్.ఆర్.సి) 4వ త్రైమాసిక జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలని కోరారు. బ్యాంకులు వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి, రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ రంగంలో వచ్చే సంవత్సరానికి 17 శాతం వృద్ధి రావాలని అందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని ఆమె కోరారు. నిరర్థక ఖాతాలలో గల డబ్బులను సంబంధితులను గుర్తించి అందజేయాలన్నారు. ఖాతాదారులను గుర్తించుటకు డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని, తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత నివ్వాలన్నారు.

కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు..

కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలని, ఇ- క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించాలని తెలిపారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. అంతకుముందు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలను, రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ జితేంద్ర కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్‌బీఐ బి.విజయకుమార్, డీఆర్‌డీఏ, మెప్మా పథక సంచాలకులు కె.శచీదేవి, సరోజినీ, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.బి.రామమోహనరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ఎ. రహీమ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తుల వివరాల నమోదు పక్కాగా ఉండాలి

- ఎస్పీ తుహిన్ సిన్హా
- పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ



యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

యలమంచిలి రూరల్ : క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)లో అన్ని క్రిమినల్ కేసుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. దేశవ్యాప్తంగా నేరస్తులను ట్రాక్ చేసేందుకు ఇది ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కోర్టుల్లో కేసు తుది తీర్పు వరకు అన్ని వివరాలను సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. బుధవారం యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఠాణాలో రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నాన్ బెయిలబుల్ వారెంట్ల గురించి ఆరా తీశారు. తీవ్రమైన నేరాల దర్యాప్తులో నేరస్తులకు న్యాయస్థానాల్లో నేరం రుజువై శిక్ష పడేలా చూడాలన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిఘా పెట్టాలన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. సీఐ ఎస్ ధనుంజయరావు, పట్టణ, ట్రాఫిక్ ఎస్ఐలు కె.సావిత్రి, బి.రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై తనిఖీలు



నర్సాపురంలో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన గనులశాఖ అధికారులు

చోడవరం: మండలంలో నర్సాపురం గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని గనుల శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల కొద్ది రోజులుగా నర్సాపురం గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరిగిన విషయం తెలిసిందే. దీనిపై మాజీ సర్పంచ్ దొడ్డి హనుమంతు జిల్లా కలెక్టర్‌కు, మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మైన్స్ అధికారి శ్రీనివాసరావుతో పాలు పలువురు సిబ్బంది నర్సాపురం వచ్చి గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. భారీ స్థాయిలో ఇక్కడ తవ్వకాలు జరిగినట్టు వారి పరిశీలనలో తేలడంతో ఆ ప్రదేశానికి కొలతలు తీసుకున్నారు. ప్రస్తుతం తవ్వకాలు నిలిపివేయడంతో అక్కడ ఎటువంటి యంత్రాలు, వాహనాలు లేవు. దీనిపై విచారణ చేసి అక్రమ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామని మైన్స్ అధికారులు తెలిపారు.

అన్ని మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

- జిల్లా పంచాయతీ అధికారి సందీప్



నాతవరం వీధుల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీవో సందీప్

నాతవరం: జిల్లాలో ఇటీవల చేపట్టిన బదిలీల్లో అన్ని మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమించామని జిల్లా పంచాయతీ అధికారి వై.సందీప్ చెప్పారు. ఆయన బుధవారం నాతవరం, మర్రిపాలెం గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్యం, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, కుళాయిలను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో పంచాయతీ, ఐసీడీఎస్, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలు క్లోరినేషన్ చేయాలని, వీధుల్లో చెత్త వేయకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గతంలో ఉన్న పంచాయతీ విస్తరణాధికారులను ప్రభుత్వం కొత్తగా డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించిందన్నారు. అన్ని పంచాయతీల్లో ప్రతి నెల ఒకటవ తేదీన గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, మండలంలో గల వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో
మహిళలకు అవమానం

- కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శించిన జల్లిపల్లి సుభద్ర



కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శిస్తున్న విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాఖ సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లభిస్తే.. కూటమి ప్రభుత్వంలో దాడులు, అఘాయిత్యాలతో తీవ్ర అవమానం ఎదుర్కొంటున్నారని ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆరోపించారు. ఇటీవల బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి వెళ్తున్న కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కూటమి నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్లతో పాటు విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభ్రద కూడా కృష్ణా జిల్లా పెడనలోని ఉప్పాల హారిక స్వగృహంలో ఆమెను పరామర్శించారు. తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలను గౌరవించలేని సమాజంలో అభివృద్ధి సాధ్యం కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయని చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉప్పాల హారికపై చంద్రబాబే దాడి చేయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే కూటమి నాయకులు హారికపై, ఆమె కాన్వాయ్‌పై దాడికి తెగబడ్డారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన సీఎం దాడులు చేయిస్తూ ఉండడం అన్యాయమన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలిపైనే దాడి జరిగితే, ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. దీనిని తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామని, న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- కె.కోటపాడులో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న లోకనాథం, రైతులు

కె.కోటపాడు : మండలంలో ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సర్వేను చేపట్టడం సరి కాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి గ్రామాల్లో గల రైతులు సీపీఎం ఆధ్వర్యంలో కె.కోటపాడులో బుధవారం నిరసన చేపట్టారు. మూడు రోడ్ల కూడలి నుంచి రైతులతో కలిసి సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు లోకనాథం మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఈ భూములనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఈ ప్రజల భూములను తీసుకునేందుకు సర్వేలు చేపట్టడం తగదన్నారు. ముందస్తుగా గ్రామ సభలను నిర్వహించి 80 నుండి 90 శాతం మంది ప్రజలు ఆమోదిస్తే ఏర్పాటుకు ముందుకు రావచ్చునని తెలిపారు. ఈ గ్రామాల్లో ఉన్న సన్న, చిన్నకారు రైతుల నుంచి భూములను తీసుకునేందుకు ప్రభుత్వం తెరచాటు యత్నాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ కోసమే ప్రభుత్వం ఈ సర్వే చేపడుతుందని సీపీఎం జిల్లా నాయకుడు డి.వెంకన్న అన్నారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందించారు.

బస్‌స్టేషన్లలో సౌకర్యాలు పెంచాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం పలు బస్‌స్టేషన్లతో పాటు ఆర్టీసీ డిస్పెన్సరీలను సందర్శించారు. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ బస్‌స్టేషన్‌ను, ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్న డిస్పెన్సరీని పరిశీలించారు. డిస్పెన్సరీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, వసతులు, జరుగుతున్న వైద్య చికిత్సలపై ఆరా తీశారు. వైద్య సేవలు పొందుతున్న వారితో మాట్లాడి సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిస్పెన్సరీల ద్వారా ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.

డిజిటల్ లైబ్రరీల కోసం కసరత్తు

- ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి



గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి కుమార్‌రాజు

నర్సీపట్నం : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.కుమార్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన నర్సీపట్నం గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ చక్కగా ఉండడంతో గ్రంథాలయ అధికారిణి దమయంతిని అభినందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 67 లైబ్రరీలు ఉన్నాయన్నారు. వీటన్నింటిని డిజిటల్ లైబ్రరీలుగా మార్చు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అన్ని లైబ్రరీల్లో అందుబాటులో ఉంచామన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల నుండి రావాల్సిన సెస్సు సుమారుగా రూ.70 కోట్లు పెండింగ్ ఉందన్నారు.

ఈ నిధులు రాబట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెస్సు ద్వారా వచ్చిన నిధులతో గ్రంథాలయాల మరమ్మతులు, సౌకర్యాల కల్పన చేపడతామన్నారు.

పగలు ఉద్యోగం.. రాత్రి దొంగతనం

- వివిధ చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్
- 68.500 గ్రాముల బంగారం స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్: మండలంలో పలు దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి సుమారు ఆరు లక్షల రూపాయల విలువ గల 68.500 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ టి.విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్.రాయవరం గ్రామానికి చెందిన కోన రాకేష్ గత కొంత కాలంగా అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామం మెల్లివారి వీధిలో నివాసముంటూ లారీ డ్రైవర్ దగ్గర హెల్పర్‌గా జీవనం సాగిస్తున్నాడన్నారు. రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు. జూన్ 23న మద్దాల వీధిలో నివాసం ఉంటున్న ఎదూరి తులసిరాణి ఇంట్లో అర్ధరాత్రి సమయంలో కిటికీ స్క్రూలు విప్పి బీరువా లాకర్లో ఉన్న బంగారం నగలు దోచుకెళ్లాడన్నారు. అదే గ్రామంలో నివాసముంటున్న మోసూరి వెంకటలక్ష్మి ఇంటి కిటికీ స్క్రూలు విప్పి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న వివిధ బంగారు వస్తువులను ఈ నెల 10న దొంగలించాడన్నారు. ఇరువురు బాధితులు పోగొట్టుకున్న మొత్తం 68.500 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సంతోష్ కుమార్, ఈశ్వరావులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నేటి నుంచి 'డీసెట్' ధ్రువీకరణ పత్రాల పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) వద్ద గురువారం నుంచి 22వ తేదీ వరకు 'డీసెట్'లో ర్యాంకు సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ బుధవారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పరిశీలన జరుగుతుంది. అర్హులైన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని ఆయన సూచించారు.

మరో ఇద్దరు కంబోడియా ఏజెంట్లు అరెస్ట్

- డేటా ఎంట్రీ జాబ్ పేరుతో నలుగురిని కంబోడియా పంపించాలని ప్రయత్నం
- ఎయిర్‌పోర్టు వద్ద ఏజెంట్లు సురేష్, ఆదిలక్ష్మిల అరెస్ట్
- విదేశాల్లో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులతో సైబర్ నేరాలు చేయిస్తున్న గ్యాంగ్
- మీడియాతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



ఏజెంట్ల నుంచి రక్షించిన బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : విదేశాల్లో ఉద్యోగం.. ఏసీ రూమ్‌లో డేటా ఎంట్రీ పని.. పెద్దగా విద్యార్హతలు లేకపోయినా రూ.లక్షల్లో జీతమని నిరుద్యోగులకు ఆశ కల్పించారు. అది నమ్మి విమానం ఎక్కిన నిరుద్యోగులతో కంబోడియాలో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. మాట వినని వారికి తిండి పెట్టకుండా దాడులకు దిగుతున్నారు. ఇప్పటివరకు కంబోడియా, మయన్మార్‌లో సైబర్ గ్యాంగ్ చేతుల్లో చిక్కుకున్న 85 మంది అమాయకులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సురక్షితంగా స్వదేశానికి రప్పించారు. 9 కేసుల్లో 22 మందిని అరెస్టు చేశారు. తాజాగా గాజువాకకు చెందిన మరో ఇద్దరు ఏజెంట్లు నలుగురు నిరుద్యోగులను కంబోడియా పంపించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఎయిర్‌పోర్టు వద్ద పట్టుకున్నారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ శంఖబ్రత బాగ్చి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

కంబోడియా నుంచి వచ్చి ఏజెంట్‌గా మారి..

గాజువాకకు చెందిన సురేష్, ఆదిలక్ష్మిలు కంబోడియాలో చైనా ఆధారిత సైబర్ స్కామ్ కంపెనీలకు నిరుద్యోగులను పంపించి భారీగా కమీషన్ సంపాదించాలని భావించారు. సురేష్ గతంలో కంబోడియాకు వెళ్లి అక్కడ చైనా స్కామ్ కంపెనీలో పనిచేశాడు. అలాగే అక్కడ విజయ్‌కుమార్ అలియాస్ సన్నీ అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడు. ఇటీవలే భారత్‌కు వచ్చి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కంబోడియాలో చైనా సైబర్ స్కామ్ కంపెనీకి ఏజెంట్‌గా మారాడు. విజయ్‌కుమార్ సూచనలతో ఆదిలక్ష్మి అలియాస్ అను సాయంతో విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మాయమాటలు చెప్పి ఇప్పటి వరకు 12 మందిని కంబోడియాకు పంపించాడు. తాజాగా మరో నలుగురు నిరుద్యోగులను కంబోడియాకు పంపించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద ఏజెంట్లు సురేష్, ఆదిలక్ష్మిలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదు, 2 వేల డాలర్లు(రూ.1.8 లక్షలు), 20 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కంబోడియాలో చైనా స్కామ్ కంపెనీలకు ప్రధాన ఏజెంట్‌గా విజయ్‌కుమార్ అలియాస్ సన్నీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి తెలుగువారిని టార్గెట్ చేసి ఏజెంట్ల ద్వారా కంబోడియాకు రప్పిస్తున్నట్లు విచారణలో బయటపడిందని సీపీ తెలిపారు.

కంబోడియాలో 500 మంది ఉత్తరాంధ్రవాసులు

మయన్మార్, కంబోడియాలో విజిటింగ్ వీసాలపై ఉత్తరాంధ్ర నుంచి 500 మంది వరకు ఉన్నట్లు చెప్పారు. వీరిలో కొందరు ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోయిన వారు కాగా.. మరికొందరు సైబర్ నేరాలు చేయాలన్న ఉద్దేశంతోనే వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. వారే అక్కడ ఏజెంట్లుగా మారి భారత్ నుంచి నిరుద్యోగ యువతను సైబర్ నేరాల కోసం తీసుకువెళుతున్నట్లు గుర్తించామన్నారు. కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్‌లో చైనా సంబంధిత స్కామ్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు ఎవరైనా ఉంటే వారి కుటుంబ సభ్యులు ఆ కంపెనీ వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. నగరంలో నకిలీ రిక్రూట్‌మెంట్ ఏజెంట్లు/కన్సల్టెన్సీల ద్వారా ఎవరైనా మోసపోయినా, ఎవరైనా విదేశాల్లో చిక్కుకుపోయినా, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గానీ, 7995095799 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డ్రగ్స్ కేసులో ఆరుగురు అనుమానితులపై నిఘా

కొకైన్ కేసులో ఆరుగురు పాత్రపై విచారణ చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా.. ఇద్దరిపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. వీరి ద్వారా మరో నలుగురి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు వెల్లడించారు. వీరిపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని, వారి కాల్ డేటా, ఇతర సాంకేతికాంశాలను విశ్లేషిస్తున్నట్లు వివరించారు. పూర్తి స్థాయిలో ఆధారాలు లభించిన వెంటనే వారిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. గాజువాకలో యువకుడిపై తలపై బీరు బాటిల్‌తో కొట్టిన కేసులో నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఒకరు పరారీలో ఉన్నారని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి మండల స్థాయి సమావేశం తుమ్మపాల పంచాయతీ బంగారురాజు ఫంక్షన్ హాల్లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, 'రీకాలింగ్ చంద్రబాబూ మేనిఫెస్టో'ను గుర్తు చేస్తూ ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, వివిధ మహిళా విభాగాల కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గ్రామస్తులకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

అనకాపల్లి టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని తుమ్మపాల వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ రావు అన్నారు. మండలంలోని మాకవరం గ్రామంలో జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి సమీపంలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. లెట్రిన్ ట్యాంకుల పైపులకు మెస్‌లు తప్పనిసరిగా కట్టుకోవాలన్నారు. తరచూ జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్‌ఈవో బి.మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్, వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ద్రావణాల తయారీపై శిక్షణ



ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న కేంద్రం నిర్వాహకులు

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరు వద్ద ఉన్న మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో బుధవారం ద్రావణాల తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 400 కోడి గుడ్లు, 200 నిమ్మ కాయల రసంతో ద్రావణాన్ని కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ తయారు చేసి చూపారు. ఇది పంటల ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి డి.రమణ, వీవోఏ జి.లక్ష్మి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 65 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,380	4,380
రెండో రకం	3,600	3,600
మూడోరకం	3,150	3,530

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపర్ మ్యాన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డీ
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వెర్జిన్ బోయిస్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్త నిల్వలు ఉన్నాయి. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 13706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- పోలీస్ స్టేషన్లలో పేరుకుపోతున్న వాహనాలు
- నిరుపయోగంగా ట్రాఫిక్ నియంత్రణ బైకులు
- తుప్పపట్టి పాడైపోతున్న వైనం



నిరుపయోగంగా ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించే ద్విచక్ర వాహనాలు



పట్టణ ట్రాఫిక్ స్టేషన్ ఆవరణలో నిలిపిన ద్విచక్ర వాహనాలు



రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూలన పడి ఉన్న కార్లు, ఆటోలు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పోలీస్ స్టేషన్లలో ద్విచక్ర వాహనాలు పేరుకుపోతున్నాయి. పట్టణం, రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో చాలా కాలంగా దాదాపు 400కు పైగా వాహనాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఈ వాహనాలు అన్నీ వివిధ కేసుల్లో పట్టుబడినవే. అత్యధికంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లలో భాగంగా సీజ్ చేసినవే. ఆయా కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో స్టేషన్ ఆవరణలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. మరోవైపు పోలీస్ స్టేషన్లలో వాహనాలు పేరుకుపోవడంతో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. అలాగే ట్రాఫిక్‌ను నియంత్రించడానికి లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వం సమకూర్చిన ద్విచక్ర వాహనాలు కూడా మూలకు చేరాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే రూ.10 వేలు జరిమానా కట్టి కోర్టుకు వెళ్లి వాహనాలు విడిపించుకోవాల్సి ఉండడంతో చాలా మంది వాహనదారులు పట్టుబడిన వాహనాలు విలువ అపరాధ రుసుం కంటే తక్కువ ఉండడంతో పోలీసు స్టేషన్ దరిదాపులకు వెళ్లడం లేదని తెలిసింది.

విడి భాగాలు మాయం

ద్విచక్ర వాహనాలు ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్ల వద్ద ఉండిపోవడంతో విడి భాగాలు మాయమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. టైర్లు, బ్యాటరీలు, ఫ్లడ్ లైట్లు.. ఇలా విడి భాగాలను దొంగలు రాత్రి వేళ పట్టుకుపోతున్నారు. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో చోరీలు జరుగుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ఆలస్యం అయ్యే కొద్ది వాహనాలు ఎందుకూ పనికి రాకుండా పోతాయన్నది వాస్తవం.

ఇవీ నిబంధనలు

నిబంధనలు అతిక్రమించిన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. వాటిని ఏమి చేయాలనే నిబంధనలను మాత్రం పట్టించుకోవడంలేదు. సీజ్ చేసిన వాహనాలలో పోలీస్ స్టేషన్‌కు తరలించిన అన్ క్లెయిమ్డ్ వాహనాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అప్పటి పరిస్థితుల బట్టి వివరాలు లభ్యం కాని వాహనాలకు ఆరు నెలలకొకసారి బహిరంగ వేలం వేయాలి. కానీ ఇలా జరగడం లేదు. నిర్ణీత సమయంలోపే విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

వాహనాలను విడిపించుకోవడం మంచిది

కేసులు పరిష్కారం కాకపోవడంతో వాహనాలు పేరుకుపోతున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో విధించిన జరిమానా కంటే వాహనాల విలువ తక్కువగా ఉందని తీసుకెళ్లడానికి ఎవరూ రావడం లేదు. ఆ విధంగా చేయడం వారికే రిస్క్. కోర్టుకు నివేదిక సమర్పిస్తే మరుక్షణం అరెస్ట్ వారెంట్ జారీ అవుతుంది. అందు వల్ల వాహనదారులు తమ వాహనాలను విడిపించుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎం.వెంకటనారాయణ, ట్రాఫిక్ సీఐ, అనకాపల్లి

సంతోషిమాత దేవస్థానంలో 21న వేలం పాటలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికలు పొందడం కోసం ఈ నెల 21న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బి.వి.ఎస్.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు నెల 31వ తేదీ వరకూ అమ్మవారి ఆలయంలో చీరలు, రవికలు పొందుటకు లైసెన్స్ ఇచ్చేందుకు ఈ వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కును ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకూ ఒక నెల రోజుల పాటు బహిరంగ వేలం వేస్తున్నామని ఆయన తెలిపారు. వేలం పాటలో పాల్గొనే భక్తులు ప్రథమ ధరావత్తు రూ.5వేలు చెల్లించాలన్నారు.

జీవీఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్షణ్ డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్, ఆటో డ్రైవర్స్, లోడర్స్‌కు జీవో నెంబర్ 36 ప్రకారం కేటగిరీల వారీగా రూ.21వేలు, రూ.24 వేలు జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోరిబిల్లి జగదీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నిమ్మకాయ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం..

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్
- కశింకోట మండల నాయకులతో సమావేశం



హాజరైన పార్టీ శ్రేణులు



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న అరబిందో కల్యాణ మండపంలో బుధవారం పార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను ముఖ్యమంత్రి మోసగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇంటింటికి వెళ్లి బాండు పేపర్లు ఇచ్చి మరీ ప్రజలకు అనేక హామీలు ఆశచూపి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం వారం రోజుల తర్వాత గ్రామ స్థాయిలో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఏడాది గడిచినా అన్నదాత సుఖీభవ అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించలేదన్నారు. తల్లికి వందనం అరకొరగా అందిస్తూ చేతులు దులుపుకొన్నారన్నారు. పేరుకు పింఛన్లు ఇస్తున్నామంటున్నా అవి పూర్తి స్థాయిలో అర్హులకు అందడం లేదన్నారు. ఉచిత గ్యాస్ పథకం కింద ఖాతాల్లో నగదు జమ చేయడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఎక్కడైనా మనస్పర్థలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. పార్టీ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని గుర్తు చేశారు. పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, ఎంపీపీ కలగా లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు నీటిపల్లి దివాకర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరక సోమునాయుడు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, చిన్ని సన్యాసినాయుడు, నమ్మి గణేష్, చిన్ని జనార్దన్, చిన్ని రాజీవ్, నారాయణరావు, సర్పంచ్‌లు సత్తిబాబు, హనుమం వెంకట్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు ఇలా.. సేద తీరేదెలా?



పార్కులో కూర్చోడానికి వీలు లేకుండా విరిగిపోయిన బెంచీలు



విరిగిపోయి వెక్కిరిస్తున్న పార్కు గేటు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్‌లో ఉన్న స్కేటింగ్ పార్కులో కనీస వసతులు కరువయ్యాయి. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పార్కులో నిత్యం అనేక మంది పిల్లలు స్కేటింగ్ శిక్షణకు వస్తుంటారు. వారితో పాటు తల్లిదండ్రులూ, వాకర్స్ నిత్యం వస్తుంటారు. అయితే స్కేటర్లు, వాకర్స్ అలసిన తర్వాత కాసేపు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయి. దీంతో వారు ఎక్కడ కూర్చోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పార్కుకు ఏర్పాటు చేసిన ప్రవేశ మార్గం గేటు విరిగిపోయింది. గేటును పక్కన పడేశారు. మేలుకోకుంటే గేటు దొంగల పాలయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ విద్యుత్ వెలుగులు ఉండడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యా మిత్ర కిట్లను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ జిలా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు అరకొరగా సరఫరా అయ్యాయని, తక్షణం పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిలా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. కొప్పాకలోని డీఈవో కార్యాలయంలో బుధవారం డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో జరిగిన ప్రమోషన్లు, బదిలీలు కారణంగా కొత్తగా మంజూరైన పోస్టుల పొజిషన్ ఐటీలు, క్యాడర్ స్ట్రెంత్ వివరాలను వీలైనంత తొందరగా జిల్లా ఖజనా శాఖ కార్యాలయానికి సర్క్యులేట్ చేయాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్పాట్ వాల్యుయేషన్, సప్లిమెంటరీ స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ తక్షణమే చెల్లించాలని కోరారు. పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: అనకాపల్లి పట్టణంలోని గాంధీమార్కెట్, గవరపాలెం విద్యుత్ శాఖ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ(ఆపరేషన్) కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతు పనులు చేపట్టనున్న కారణంగా రఘురాం కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కళాశాల ఏరియా, సత్యెమ్మతల్లి ఆర్చ్, గోపాలకృష్ణ థియేటర్ ప్రాంతం ఏరియా, జాతీయ రహదారి కొప్పాక వంతెన, 11కేవీ నూకాంబిక ఫీడర్ పరిధిలో నూకాంబిక దేవాలయం, చాకలిపేట, ఇందిరమ్మ కాలనీ, రాణిగారిపూలతోట రహదారి, అగ్గిమర్రిచెట్టు, కోటవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.

మండలంలో తుమ్మపాల, మార్టూరు గ్రామాల్లో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 18న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ కశింకోట ఏఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

కశింకోట: కశింకోటలో ఉన్న ఏపీఈపీడీసీఎల్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి మండలం తుమ్మపాల, మాటూరు, కొత్తూరు, పిసినికాడ గ్రామాలు, కశింకోట మండలలోని గ్రామాలు, సబ్బవరం మండలంలోని పెదనాయుడుపాలెం, ఆదిరెడ్డిపాలెం, జోడిగుళ్ల జంక్షన్, చిన్నయ్యపాలెం, గొల్లలపాలెం, పరవాడ మండలంలోని లంకెలపాలెం, మంత్రిపాలెం, మునగపాక మండలంలోని తిమ్మరాజుపేట, మునగపాక, అరబుపాలెం, వాడ్రాపల్లి, మంగళవానిపేట, గొల్లలపాలెం, మల్లివరరం, అప్పికొండవానిపాలెం, కుంచవానిపాలెం, పి.నాగవరం, కె.నాగవరం, నాగులాపల్లి, గంగాదేవిపేట, ఒంపోలు, జేపీ అగ్రహారం, ఉమ్మలాడ, గాజువాక మండలంలోని యాతపాలెం, లక్కరాజుపాలెం, అగనంపూడి గ్రామాల్లో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నరసింగబిల్లి, ఏనుగుతుని, చింతలపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, తీడ,చెరకాం తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు. వ్యవసాయ రంగానికి ఆ రోజు ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మధ్యవర్తిత్వంతో సులువుగా కేసుల పరిష్కారం



పట్టణంలో మధ్యవర్తిత్వంపై ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జిలు, లాయర్లు

అనకాపల్లి టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులందరూ కేసులను సులువుగా పరిష్కరించుకోవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ అన్నారు. పట్టణంలోని హైకోర్టు ఆదేశాలు మేరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న తగాదాలకు కోర్టులకు రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి పి.నాగేశ్వరరావు, అడిషనల్ జడ్జి జి.రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

అనకాపల్లి టౌన్: గత వారం రోజుల నుంచి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు పట్టణంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఊరట చెందారు. ఒక్కసారిగా చల్లని గాలు వీస్తూ సుమారు అరగంట పాటు ఏకదాటిన వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నిరంతర అధ్యయనానికి సిద్ధం కావాలి



సదస్సుకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కాంద్రేగుల వెంకటరమణ

అనకాపల్లి: సాంకేతికత వేగంగా పెరుగుతున్న తరుణంలో నిరంతర అధ్యయనానికి యువత సిద్ధంగా ఉండాలని రాష్ట ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట ప్రభుత్వ సలహా కమిటీ(ఈఆర్‌సీ ఎస్ఏసీ) సభ్యుడు కాంద్రేగుల వెంకటరమణ అన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా బుధవారం నరసింగరావుపేటలోని నెస్ట్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ కార్యాలయంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఏఐ, డిజిటల్ నైపుణ్యాల ద్వారా యువత సాధికారత'అంశంపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేథ వచ్చాక కొత్త ఉద్యోగాల సృష్టి ఊపందుకుంటోందన్నారు. సృజన, నైపుణ్యాలున్న యువతకు ఏఐ రంగంలో ఉపాధి 68 శాతం పెరుగుతుందన్నారు. సాంకేతిక రంగంలో ప్రతిభావంతుల కోసం బహుళజాతి సంస్థలు ఎదురు చూస్తున్నాయన్నారు. సదస్సుకు హాజరైన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ సంఘటన్ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నెస్ట్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సీఈవో పిళ్లా రమేష్‌బాబు, బీజేపీ కిషాన్ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు గొంతిన భక్త సాయిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టు రూ.4 లక్షలకు విక్రయం

- రిలే నిరాహార దీక్ష చేపట్టిన అభ్యర్థి సునీత
- తిమ్మరాజుపేటలో ఎమ్మెల్యే సోదరుడి నిర్వాకం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న మంత్రి సునీతకు మద్దతు తెలిపిన ఎస్సీ సంఘాల నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తన దక్కలేదంటూ మండలంలో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన మంత్రి సునీత బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ పోస్టును రూ.4లక్షలకు అమ్ముకున్నారంటూ స్థానిక ఎమ్మెల్యే, అధికారులపై ఆమె ఆరోపణ చేశారు. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం గ్రామంలో ఆమె ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్ మృతి చెందడంతో ఖాళీ అయిన పోస్టుకు మూడు నెలల క్రితం నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆ పోస్టుకు గ్రామంలో తనతో పాటు మరో నలుగురు దరఖాస్తు చేయగా, తన కుటుంబ పరిస్థితిని సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కి వివరించగా తనకే ఆ పోస్టు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ పోస్టు కోసం ఎమ్మెల్యే సోదరుడు సుందరపు సతీష్‌కుమార్ రూ.4 లక్షలు లంచం తీసుకుని అదే గ్రామానికి చెందిన బీసీకి చెందిన యువతికి కట్టబెట్టారని సునీత ఆరోపించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు : ఈ విషయమై సునీత.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఐసీడీసీ పీడీకి ఫిర్యాదు అప్పగించారు. నేటివిటి, క్యాస్ట్ సర్టిఫికెట్లు లేకుండా పోస్టులో జాయిన్ అయినట్లు విచారణలో నిర్ధారణ చేశారని సునీత తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించిన పోస్టును బీసీలకు ఇచ్చారంటూ ఆమె రిలే నిరాహార దీక్ష చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

తుమ్మపాల: జిల్లాలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ గురువారం పర్యటించనున్నట్లు డీఆర్వో వై.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై జిల్లాలో షెడ్యూల్డ్ కులాల జనాభా, స్థితిగతులు, కేంద్ర, రాష్ట ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, నివాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలపై తీసుకుంటున్న చర్యలు వంటి అనేక అంశాలపై చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.